జగన్‌తోనే సంక్షేమ వెల్లువ

- సంక్షేమ పండుగ చేసిన జగన్ ప్రభుత్వం
- సూపర్ సిక్స్ కూడా అమలు చేయలేని కూటమి ప్రభుత్వం
- బహిరంగంగానే విమర్శిస్తున్న ప్రజానీకం


దెందులూరులో వైఎస్సార్ చేయూత చెక్కును అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో గత ఐదేళ్లపాటు సంక్షేమం పరవళ్లు రుచిచూసిన ప్రజానీకం నేడు జగన్ ఉంటేనా.. అనే నానుడితో రోజులు వెళ్లదీస్తున్నారు. ఐదేళ్లపాటు అర్హులైన అన్ని వర్గాలకు సంక్షేమం అందజేసి ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజానీకం మననం చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజానీకం తీవ్ర నిరసనను బహిరంగంగానే వ్యక్తపరుస్తున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి కూడా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వకపోవడంతో ప్రజలు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. అమ్మ ఒడి పేరుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 15వేలు ఇవ్వగా, కూటమి ప్రభుత్వం అదే పథకానికి తల్లికి వందనం పేరుపెట్టి ఎంతమంది పిల్లలుంటే అంత మందికి రూ. 15వేలు ఇస్తామని మరీ చెప్పారు. కానీ ఇంతవరకు అమలు చేయకపోవడంతో తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. నలుగురు కలిస్తే చాలు జగన్ ఉంటేనా అనే మాట ప్రతి ఒక్కరి నోటా వినిపించడం జగన్ చరిష్మా ఏంటో తెలుస్తోంది. గత ఐదేళ్ల కాలంలో దెందులూరు నియోజకవర్గం దెందులూరు, పెదపాడు, పెదవేగిలో సంక్షేమం, అభివృద్ధికి దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బాయ్య చౌదరి పాటుపడ్డారు.

సంక్షేమం అంటే జగన్

పేద ప్రజలందరికీ సంక్షేమం అందజేసిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరి గుండెల్లో నిలిచారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమం అందజేసి చరిత్రలో నిలిచే పాలన అందజేసిన ఘనత జగన్‌కు మాత్రమే దక్కుతుంది. ముఖ్యంగా విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారు. పేద పిల్లలను చదివించాలంటూ అమ్మ ఒడి ద్వారా రూ. 15వేలు అందజేశారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల రోగాలకు వైద్యసేవలందించడమే కాకుండా రూ. వెయ్యి ఖర్చుదాటితే ఆరోగ్యశ్రీని అమలుచేసే విధానం అందరికీ అండగా నిలిచింది.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి పేదలను ఆదుకున్నారు. గత ఐదేళ్లలో పేదింటి పిల్లలు ఖరీదైన విద్యనందుకుని ఉన్నత స్థాయికి చేరారు. ఎస్సీ వర్గాలకు ఉచిత విద్యుత్ అందజేసి వారిని కూడా ఆదుకున్నారు.

క్యాలెండర్ ప్రకారం సంక్షేమం

ప్రజాసంకల్పయాత్ర ద్వారా ప్రజల కష్టాలను నేరుగా చూసి రూపొందించిన సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం క్యాలెండర్ ప్రకారం పూర్తిస్థాయిలో అమలు చేశారు. జగనన్న అమ్మ ఒడి, డ్వాక్రా వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నావడ్డీ, పంట రుణాలు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న వసతిదీవెన, జగనన్న విద్యాదీవెన, జగనన్న విదేశీ దీవెన, మత్స్యకార భరోసా, వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ నేతన్ననేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ లా నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, జగనన్న తోడు, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ జలకళ, జగనన్న విద్యాకానుక, జగనన్న ట్యాబ్‌లు, జగనన్న కాలనీలు వంటి సంక్షేమం అర్హులందరి ఇంటి గుమ్మంలోకి నడిచివచ్చే పరిస్థితి ఉండేది. కానీ నేడు ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాల అమలుకే కూటమి ప్రభుత్వం పురిటి నొప్పులు పడుతోందని ప్రజానీకం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముఖ్యంగా పేదల సొంతింటి కలను నిజం చేస్తూ జగనన్న కాలనీల పేరుతో పట్టణంలో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు చేశారు. అర్హత ఉంటే చాలు సంక్షేమం ఇంటి గడపలోకి వచ్చే విధంగా పాలన అందజేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది.

కన్నాపురం వాసికి గిన్నిస్ బుక్‌లో స్థానం



అవార్డు అందుకుంటున్న నాగ సౌమ్య ప్రదీప్

కొయ్యలగూడెం: కన్నాపురానికి చెందిన జలగం నాగ సౌమ్య ప్రదీప్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం దక్కింది. ఆమె శుక్రవారం విజయవాడలో మెట్రో పోలిటీన్ చర్చిలో మెడల్స్, సర్టిఫికెట్లను అందుకున్నట్టు తెలిపారు. 2024 డిసెంబర్ ఒకటో తేదీన విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో హాలేల్ మ్యూజిక్ స్కూల్ నుంచి బ్రదర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో 1090 మంది విద్యార్థులు పియానో స్వరాలను ఇన్‌స్టాగామ్‌లో అప్లోడ్ చేయగా, 1046 మంది గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారని పేర్కొన్నారు. రికార్డును సొంతం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. 2024లో కూడా తాను ఆసియ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంజినియోస్ చార్మ్ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నాని గుర్తుచేశారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

లింగపాలెం: హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సీఐ సీహెచ్ రాజశేఖర్, ఎస్సై వెంకన్న అన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే మేలుపై స్థానికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్టు ధరించాలన్నారు. ఈ సందర్భంగా వాహనచోదకులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఉంగుటూరు: రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. శనివారం ఉంగుటూరులో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలో వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1400 మంది రైతులకు 3.94 కోట్లు రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 115 మంది రైతులకు 77 లక్షల రాయితీపై పరికరాలు అందజేశామని వివరించారు. రైతులు ఆధునిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని సాగు చేయాలని రైతులకు సూచించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ ఐదేళ్ల తర్వాత వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు రైతులకు అందజేయడం శుభపరిణామన్నారు. తక్కువ ఖర్చుతో పంటలు పండించే విధానాన్ని రైతులు అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలు సబ్సిడీతో పంపిణీతోపాటు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి రైతు సేవాకేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, నారాయణపురం, ఉంగుటూరు సర్పంచ్‌లు దిడ్ల అలకానంద, బండారు సింధు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజ్‌మనోజు, ఎఓ ప్రవీణ్‌కుమార్, ఎడిఏ ఉషారాజకుమారి, మార్కెటు కమిటీ చైర్మన్ సూరత్తులు గీత అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల నివారణ


డ్రం స్టాపర్లును ప్రారంభిస్తున్న సీఐ యూజే విల్సన్, సర్పంచ్ షేక్ రహీమాబేగం, పెద్దలు

భీమడోలు: ప్రమాదకర మలుపుల వద్ద వాహనదారులు నిదానంగా నడిపి ప్రమాదాలకు దూరంగా ఉండాలని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. రాష్ట్రీయ రహదారి ద్వారకాతిరుమల వెళ్లే రోడ్డులోని పోలసానిపల్లి పంచాయతీ శివారు ఆంజనేయనగరం వద్ద అతి ప్రమాదకరమైన మలుపు వద్ద శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన డ్రం స్టాపర్లును సర్పంచ్ షేక్ రహీమాబేగంతో కలిసి సీఐ యూజే విల్సన్ ప్రారంభించారు. ఈ రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో పలువురు క్షతగాత్రులయ్యాయని, ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారని పేర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై వాహనాలు అతివేగంగా ప్రయాణించడంతో రోడ్డు మలుపులను గుర్తించకపోవడంతో రాత్రి వేళల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ద్వారకాతిరుమల రహదారి ప్రమాదరహిత రహదారిగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తతో జాగ్రత్తలను పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, అతివేగంతో ప్రయాణించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వై.సుధాకర్, గ్రామకార్యదర్శి యు.జయరామకృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సుజీవరాజు సేవలు చిరస్మరణీయం


సుజీవరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దెందులూరు: బైబిల్ మిషన్ పాస్టర్ సుజీవరాజు పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, మల్లవరం గ్రామాలతో పాటు ప్రాంతాలకు అతీతంగా చేసిన దేవుని సేవ చిరస్మరణీయమని, ఏ రంగంలోనైనా అంకిత భావంతో చేసిన పని ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మోరు రామరాజు, వడ్డీలు కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముంగర సంజీవ్ కుమార్, ఐఆర్‌ఎస్ రిటైర్డ్ ఆఫీసర్ చాగంటి సంజీవ్ అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడు బైబిల్ మిషన్ చర్చిలో ఏపీ ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, డాక్టర్ సుజీవరాజు కుటుంబ సభ్యులు, సంఘ సభ్యులు ఆధ్వర్యంలో పాస్టర్ సుజీవరాజు సంస్మరణ సభ నిర్వహించారు. కొల్లేరు గ్రామాల నుంచి వేలాదిమంది విశ్వాసులు వందలాది మంది పాస్టర్లు సంస్మరణ సభకు హాజరై ఆయన సేవలను కొనియాడారు.

ఉత్తమ విద్యార్థులకు యూటీఎఫ్ నేతల సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

పెదవేగి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతి పరీక్ష ఫలితాల్లో చక్కటి ప్రతిభ కనబరచిన విద్యార్థులను యూటీఎఫ్ ఉపాధ్యాయ నాయకులు సత్కరించారు. శనివారం పెదవేగి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూటీఎఫ్ పెదవేగి మండల శాఖ తరపున మెమోంటో, శాలువాతో సత్కరించారు. పదిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేరా ప్రభాకర్, పి వెంకటరమణ, ఎం లక్ష్మీనారాయణ, సీహెచ్ శ్రీను, ఎం లక్ష్మణరావు, ఎ నాగరాజు, డి త్రినాథ్, సీహెచ్ నాగేశ్వరరావు, స్వామి, వీ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధస్సు పెంపు


చెస్ పోటీలను తిలకిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): చదరంగం పోటీలు పిల్లల మేధస్సు పెంపునకు దోహదం పడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు అన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలు, మేడే సందర్భంగా శనివారం ఉదయం స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సీపీఐ ఆఫీస్ స్ఫూర్తి భవన్‌లో రెండు రోజుల జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డాంగే, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులు పి.కిషోర్‌లు మాట్లాడారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి అప్పలరాజు, నాయకులు బి జగన్నాథరావు, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, యర్ర వెంకటేశ్వర్లు, కె.జగన్, చెస్ టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ కృష్ణకుమారి, కోచ్ లక్ష్మణరావు, సహాయకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని సవరించాలి

ఏలూరు (టూటౌన్): ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:53గా పరిగణించి రేషనలైజేషన్ చేయడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు పేర్కొన్నారు. ఆ నిష్పత్తిని 1:40గా మార్పు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తరగతిలో 53 మంది వరకు విద్యార్థులు ఉంటే ఒక సెక్షన్, 54 మంది దాటితే రెండో సెక్షన్‌గా భావిస్తూ సెక్షన్‌ల ప్రతిపదికన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేస్తున్నారని తెలిపారు. 1:53 ప్రకారం సెక్షన్‌ల ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయింపు వల్ల ప్రతి పాఠశాలలోనూ సర్‌ప్లస్ ఉపాధ్యాయులు అధికమయ్యారని వివరించారు. ఈ మిగులు ఉపాధ్యాయులను ఏం చేయాలన్న విషయమై రకరకాల ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకున్నారని తెలిపారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి సవరించి స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలల్లోనే కొనసాగిస్తే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని ఆంజనేయులు వివరించారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం

కొయ్యలగూడెం: జీవావళికి ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరమని సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి పేర్కొన్నారు. శనివారం బయన్నగూడెంలోని సాయి కృష్ణ గోశాల వద్ద ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి సంజీవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలు (నవధాన్యాలు) పచ్చిరొట్ట పెంపకం, దాని ఉపయోగాలపై చర్చించారు. ఈ విధానాలు పాటించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. నవధాన్యాల కిట్లు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులు సుంకర సత్తిరాజు, బాలం గంగాధర్, తలారి పోతురాజు, మల్లబత్తుల నాగరాజు, రొక్కం వెంకటేశ్వరరావులను సన్మానించారు. రైతులకు నవధాన్యాలు కిట్లు పంపిణీ చేశారు. సుజాత, రవి, పాపారావు, సావిత్రి జ్యోతి, దివ్య, పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో తనిఖీలు

జంగారెడ్డిగూడెం: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నామని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెంలో శనివారం ఆయన విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఉగ్రదాడులు నేపథ్యంలో అసాంఘిక శక్తుల ఉనికి లేకుండా పట్టణంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. లాడ్జీలు, బస్టాండ్, జనసమర్థం ఉన్న ప్రాంతాలు, అనుమానిత ప్రాంతాల్లో పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు చేశామన్నారు. అనుమానిత వ్యక్తులతో పాటు, గంజాయి, సారా, మద్యం రవాణా, మదక ద్రవ్యాల రవాణా తదితర వాటిపై కూడా తనిఖీలు చేపట్టామని వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి కార్యకలాపాలైనా ఉపేక్షించేది లేదన్నారు. డీఎస్పీ వెంట ఏఎస్సై వై.మంగయ్య, ఎస్ ఉమామహేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు. మండలంలోని లక్కవరంలో ఎస్సై డి.శశాంక ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేశారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి


గణపవరంలో ఉగ్రదాడులకు వ్యతిరేకంగా ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

భీమడోలు: ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని గుండుగొలనులో సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ఉగ్రవాద దాడిలో హతమైన భారతీయులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ప్లకార్డులను చేతపట్టుకొని నినాదాలు చేశారు. దేశ సమగ్రత, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కొన్నాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిరిబత్తిన కొండబాబు, మామిళ్లపల్లి కాశీబాబు, బర్ల రమణమూర్తి, ప్రవీణ్‌కుమార్ పటేల్, కోడూరి నరసింహమూర్తి, ముత్యాల నరసింహారావు, యువకులు, వివిధ సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

ఉగ్రదాడులపై సమష్టిపోరు

గణపవరం: జమ్మూ కాశ్మీర్‌లోని పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి హతమార్చడం అమానుషమని, ఉగ్రదాడులను ప్రజలంతా సమష్టిగా ఎదుర్కోవాలని పలువురు వక్తలు తెలిపారు. అమాయకులపై ఉగ్రమూకల దాడులకు వ్యతిరేకంగా గణపవరంలో ముస్లింలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద్దమసీదునుంచి గణపవరం ప్రధాన వీధులగుండా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గణపవరం పోలీస్ ఐలెండ్ సెంటర్‌లో ముస్లింలు మానవహారం ఏర్పాటు చేసి, ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞచేశారు. ఈకార్యక్రమంలో మసీదు గురువులు, మసీదు కమిటీ సభ్యులతో పాటు పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయకులపై ఉగ్రవాదులు చేసిన క్రూరమైన చర్యను ఖండిస్తూ శనివారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉనుముల రాంబాబు, కార్యదర్శి డాకి జోగినాయుడు, గౌరవ అధ్యక్షుడు సీతాల సత్యనారాయణ, జిల్లా కార్యవ ర్గ సభ్యుడు పాప్పాల నర్సింహరావు, ఉపాధ్యక్షుడు టి. వివయ్య కోశాధికారి ఊట ఆనంద్ కుమార్ ,సీనియర్ నాయకులు కలిగొట్ల శ్రీఆమకృష్ణ, బొమ్మిడి ప్రసాదు, రాజు, కొరపాటి హరికృష్ణ, చక్రవర్తి , ఉపేంద్రం బాబావలి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గుండుగొలనులో కాగడాలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ఉంగుటూరులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఘనంగా నిత్య సహాయ మాత ఉత్సవాలు


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఫాదర్లు

దెందులూరు: మండలంలోని సానిగూడెంలోని నిత్య సహాయ మాత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవుని సువా ర్త విశ్వవ్యాప్తం కావాలని దేవుని సేవలో ప్రతి ఒక్కరు తమ వంతు సహాయ సహకారాలు అందజేయాలని ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల, మిషనరీస్ ఆఫ్ కంపాస్ సుపీరియర్ జనరల్ ఫాదర్ బోబిన్ అన్నారు. ఫాదర్ బొడ్డు ఫ్రాన్సిస్ సానిగూడెం విచారణ కర్తఫాదర్ జోష్ పాల్‌లతో కలిసి నిత్య సహాయ మాత టవర్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు పూజలు నిర్వహించారు. శివారు గ్రామంలో సైతం దేవుని పట్ల అంకితభావం నిరంతర ప్రార్థన కలిగి ఉన్న సానిగూడెం విచారణ సంఘస్తులను అభినందించారు. ఈ వేడుకల్లో సానిగూడెం గ్రామ పెద్దలు, సంఘస్తులు, యువత, మరియాదళ సభ్యులు, ఇతర గ్రామాలనుంచి వచ్చిన విశ్వాసులు ఉన్నారు.

చేపల వ్యర్థాల వాహనం పట్టివేత

దెందులూరు: జాతీయ రహదారిపై శనివారం గుండుగొలను వంతెన వద్ద హైదరాబాదు నుంచి తోకలపల్లి గ్రామానికి 3 టన్నుల చేపల వ్యర్థాలు తీసుకువెళ్తున్న బొలెరో వాహనాన్ని దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ, సిబ్బంది పట్టుకున్నారు. వాహనం డ్రైవర్ మూడు నరసింహమూర్తిని అరెస్ట్ చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు


ద్విచక్రవాహనాలను నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సుభాష్, ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: మైనర్లకు వాహనాలు ఇస్తే నడుతున్న వారితోపాటు వాహన యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ హెచ్చరించారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో శనివారం గణపవరం – ఏలూరు ఆర్‌అండ్‌బీ రహదారిపై నిడమర్రు పోలీసులు వాహనాల తనఖీలు నిర్వహించి, వాహనదారుల వివరాలు, ఏఏ ప్రాంతాల నుంచి వస్తున్నారు, వెళుతున్నారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానస్పదంగా ఉన్నవారి విషయంలో పూర్తి వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలో లైసెన్స్, సీబుక్ లేనివారికి అపరాధ రుసుం విధించారు. పలువురు వాహనాలు నడుతున్న మైనర్లకు సీఐ సుభాష్ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ వాహన తనఖీల్లో నిడమర్రు ఎస్సై వీరప్రసాద్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పద్దాల వెంకమ్మ జాతర


కోమర్రులో అమ్మవారిని దర్శించుకున్న వాసుబాబు

గణపవరం: గణపవరం మండలం కోమర్రు గ్రామంలో పద్దాల వెంకమ్మఅమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. శనివారం ఉదయం అమ్మవారిని వైఎస్సార్ సీపీ పీఏసి సభ్యుడు, మాజీ ఎంఎల్ఏ పుప్పాల వాసుబాబు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, గ్రామస్తులు వాసుబాబుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వాసుబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు అమ్మవారికి నైవేధ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, మాజీ సర్పంచ్ వడ్డి ఉమ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి పోప్ ఫ్రాన్సిస్ సేవలు చిరస్మరణీయం


పోప్ ఫ్రాన్సిస్‌కు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

దెందులూరు: ప్రపంచ శాంతి ఆధ్యాత్మిక అభివృద్ధికి పోప్ ఫ్రాన్సిస్ సేవలు చిరస్మరణీయమని ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల, సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజ్ కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ అన్నారు. శనివారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో వికార్ జనరల్ డాక్టర్ బాల ఆధ్వర్యంలో పోప్ సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఛాన్సలర్ ఫాదర్ బాబు జార్జ్, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానుయేల్, ఫాదర్ మోజెస్, వికార్ జనరల్ బాల పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వవ్యాప్తంగా ఆయన చేసిన కృషిని కొనియాడారు.

డ్వాక్రా సీఏ రూ.36 లక్షలకు కుచ్చుటోపీ

భీమడోలు: గణపవరం మండలం ముగ్గళ్లలో డ్వాక్రా సీఏ రూ.36 లక్షలకు కుచ్చుటోపీ పెట్టిందని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుకు డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారు. శనివారం కురెళ్లగూడెంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన గన్నిని కలిసి వారు ఈ విషయం వెల్లడించారు. తాము కష్టించి సంపాదించుకున్న సొమ్మును అక్రమంగా దోచుకుందని, అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన గన్ని వీరాంజనేయులు సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముగ్గళ్ల సర్పంచ్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

దెందులూరు: ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని మండల కేంద్రమైన దెందులూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రామ్మోహనరావు మాట్లాడుతూ పశువైద్యుని పాత్ర ఒన్ హెల్త్‌లో కీలకమైందని, ఆహారంగా ఉపయోగపడే పశువులకు వైద్యం చేయడం కత్తిమీద సాములాంటిదని అన్నారు. ఈ ఏడాది ప్రపంచ పశువైద్య నినాదంతో పశువుల ఆరోగ్యం కోసం సమష్టిగా కృషి చేయాలని సూచించారు.